ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

3 సోమవారం 9 సెప్టెంబరు 2024

రివాల్వర్‌తో బెదిరింపు : ముగ్గురి అరెస్ట్ 5లో..

దర్గాగా ప్రభుత్వ స్థలం కబ్జా : అడ్డుకున్న స్థానికులు 5లో..

అక్షరాస్యతా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్ (ఫైల్)



అక్షరాస్యత పెంపే లక్ష్యంగా..

- నిరక్షరాస్యులను గుర్తించేందుకు సర్వే
- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక
- వయోజనుల కోసం 'ఎన్ఐఎల్‌పీ'
- జిల్లాలో అక్షరాస్యతా శాతం 64.35

మంచిర్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత కారణంగా మారుమూల గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.పట్టణాలతో పోల్చి తే పల్లెల్లో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉండటంతో అభివృద్ధికి నోచు కోవడం లేదు. దీంతో పల్లెలపై ప్రత్యేక దృష్టి సారించిన కేంద్ర ప్రభు త్వం గ్రామాల్లో అక్షర వెలుగులు నింపే లక్ష్యంతో న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పి) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగం గా 15 ఏళ్లు పైబడిన వయోజనులను గుర్తించేందుకు ప్రత్యేకంగా సర్వే చేపడుతోంది. కార్యక్రమానికి కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా కార్యక్ర మానికి రూపకల్పన చేసింది. ఉన్నత పాఠశాలల్లోని ముగ్గురు ఉపాధ్యా యుల పర్యవేక్షణలో ఆయా స్కూళ్లలో విద్యనభ్యసించే 8, 9, 10 తరగ తుల విద్యార్థులచే వయోజనులకు చదవడం, రాయడం నేర్పించనున్నారు.

• జిల్లాలో 64.35 అక్షరాస్యత శాతం

జిల్లాలో 64.35 శాతం అక్షరాస్యత ఉంది. దాన్ని వంద శాతం పెం చేలా చర్యలు చేపడుతున్నారు. 2011 సెన్సస్ ప్రకారం జిల్లాలో 8,07,037 మంది జనాభా ఉన్నారు. వీరిలో 4,08,272 మంది పురుషులు, 3,98,765 మంది స్త్రీలు ఉన్నారు. వీరిలో మున్సిపాలిటీలు మినహా గ్రామాల్లో అక్షరాస్యత లేని పురుషులు 31,767 మంది కాగా, స్త్రీలు 53,000 మంది ఉన్నారు. ట్రాన్స్ జెండర్స్ 13 మంది ఉన్నారు. వారందరికీ చదువు నేర్పించాలనే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

• కలెక్టర్ ప్రత్యేక చొరవతో..

కేంద్ర ప్రభుత్వ ప్రణాళికకు అదనంగా జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో పల్లెల్లో అక్షర్యాస్యతా పెంపొందించేందుకు కార్యాచరణ రూపొం దించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఇంటర్, డిగ్రీ, పీజీలు చదివిన మహిళలను ఎంపిక చేసి ముందుగా వారికి కుట్టు మిషన్ శిక్షణ ఇస్తారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలతో గ్రామంలో నిరక్షరాస్యులైన మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇప్పిస్తారు. దాంతోపాటే చదువడం, రాయడం కూడా నేర్పిస్తారు. ఇందుకుగాను నిరక్షరాస్యులకు చదువు చెప్పే మహిళలకు స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టుల ద్వారా గౌరవ వేతనం చెల్లిస్తారు. అలా గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అక్షరాస్యతకు దూరంగా ఉన్న ఆదివాసీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

• ఈచ్ వన్....టీచ్ ఫైవ్....

పల్లెల్లో నిరక్ష్యరాస్యులకు చదువు నేర్పేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఎన్ఐఎల్‌పీ పథకంలో భాగంగా ఈచ్ వన్...టీచ్ ఫైవ్ నినాదంతో ముందుకు వెళ్లనున్నారు. చదవడం, రాయడం వచ్చిన ప్రతి ఒక్కరూ మరో ఐదుగురు నిరక్ష్యరాస్యులను అక్ష్యరాస్యులుగా తీర్చిదిద్దాలి. 2020లో రాష్ట్ర ప్రభుత్వం ఈచ్ వన్.....టీచ్ వన్ నినాదంతో కార్యక్రమం ప్రవేశపెట్టి పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో సర్వే నిర్వహించింది. అనంతరం విద్యావంతులు నిరక్ష్యరాస్యులకు చదువు చెప్పాలని నిర్దేశించింది. అలాగే మహిళా సంఘాల ఆధ్వర్యంలో కూడా ఒక్కో వార్డులో నిరక్ష్యరాస్యుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక విద్యాబోధన కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించింది. అయితే ఆ కార్యక్రమాలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో లక్ష్యం నెరవేరలేదు. మరోవైపు కేంద్రం పడ్‌నా...లిఖ్‌నా...అభియాన్ అమలు చేసేందుకు నిరక్షరాస్యుల వివరాలు సేకరించింది. వివరాలను అధికారులు పంచాయతీరాజ్ శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అక్షరాస్యత పెంచే బాధ్యతలను పంచాయతీలకు అప్ప గించారు. కరోనా విజృంభణతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా న్యూ ఇండియా లిటరసీ ద్వారా పల్లెల్లో అక్షరాస్యతా పెంచేందుకు కేంద్రం పథక రచన చేసింది.

అక్షరాస్యత పెంచేందుకు కృషి....

- వయోజన విద్య జిల్లా ప్రాజెక్టు అధికారి పురుషోత్తం



కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రత్యేక చొరవతో రూపొందించిన కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని చదువు కున్న మహిళలతో నూరు శాతం అక్షరాస్యత కోసం కృషి చేస్తున్నాం. మహిళలకు చదువుతోపాటు కుట్టు మిషన్ శిక్షణ ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నాం. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, వివిధ శాఖల అధికారులు, యువత సహాయ సహకారాలు అందజేస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఐఎల్‌పీ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

మంచిర్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో మోస్తరు వర్షం కురిసింది. మందమర్రి మండలం అందుగుల పేటలో 3.3 సెం.మీ వర్షం పడగా, కాసిపేట మండలం కొండాపూర్‌లో 3.2 సెం.మీ, చెన్నూరు మండలంలో 1.8 సెం.మీ, భీమా రం మండలంలో 1.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 50,463 క్యూసె క్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 11,550 క్యూసెక్కులు, వర్షం కారణంగా 39,813 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లకుగాను ప్రస్తుతం 147.86 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 19.786 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వరద కొనసాగుతుండటంతో 12 గేట్లు తెరిచి 96,348 క్యూసెక్కు ల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు.

స్థలం కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 8: పట్టణంలోని కన్నాల బస్తీ ఏరియాలో తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కేటాయిం చిన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్‌లు అన్నారు. శనివారం టీడీపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1994లో టీడీపీ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం 8 గుంటల స్థలాన్ని కేటాయించిందన్నారు. స్థలాన్ని కొందరు కబ్జా చేసి నిర్మాణం చేపట్టారన్నారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసులకు వినతిపత్రం అందజేశామన్నారు. కబ్జాదారు లపై చర్యలు తీసుకోవాలని, స్థలాన్ని అప్పగించాలని కోరారు. నాయకులు దామోదర్‌రెడ్డి, రమేష్, గంగాధర్ రావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

హాజీపూర్, సెప్టెంబరు 8: ఆదిమ గిరిజనులైన కొలాంలు నివసించే కొలాంగూడకు అండగా ఉం టామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆది వారం పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధి కొలాం గూడలో రూ.38.15 లక్షలతో నిర్మించే పాఠశాల భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. పలు వురు కొలాంగూడ వాసులు తాము అడవికి వెళ్లి వెదురు బొంగు తెచ్చుకునేందుకు అటవీ అధికారు లు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యేకు మొర పెట్టుకు న్నారు. అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పి స్తానని ఎమ్మెల్యే తెలిపారు. కొలాంవాసులు సొసైటీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి రుణాలను మంజూరు చేయిస్తామని తెలిపారు. పలువురు రైతులు పొలాలకు వెళ్లే దారి వర్షానికి బురదమ యం అవుతుందని బీటీ రోడ్డు వేయించాలని కోరా రు. రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యేకు తెలుపగా మం డల అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్క రించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన వసతులతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్య మైన విద్య అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్య మని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను కొలాంగూడకే మంజూరు చేయించి, గృహాలకు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో 70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఫారెస్టు అధి కారులు ట్రెంచు కొట్టారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సర్వే చేయించి ప్రభుత్వ భూమి అని తేలితే పేదలకు, నిర్వాసితులకు పం పిణీ చేస్తామని తెలిపారు. టీజీడబ్ల్యూఐడీసీ డీఈ శ్రీనివాస్, ఏఈ రాజేశం, ఎంఈవో పోచన్న, పీఏసీ ఎస్ చైర్మన్ కోట సత్తయ్య, మంచిర్యాల పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచు పొట్టాల సుమలత, శ్రీశైలంగౌడ్, ఎంపీటీసీ బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు తోట రవి, సంజీవరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొలాంగూడలో పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రైవేటు ఉపాధ్యాయులకు బీమా కల్పిస్తాం

శ్రీరాంపూర్: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపా ధ్యాయులకు జీవిత బీమా కల్పించేందుకు కృషి చేస్తాన ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు అన్నారు. ప్రైవే టు పాఠశాలల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవే టు పాఠశాలల యాజమా న్యాలు, ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించేలా చూస్తామ న్నారు. విద్యావంతులను తయారు చేసేది ఉపాధ్యాయులేనన్నారు. ఉన్నతమైన వృత్తిలో ఉన్న వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది ఉపాధ్యా య దినోత్సవం సందర్భంగా ప్రభు త్వ ఉపాధ్యాయులతోపాటుగా ప్రై వేటు టీచర్లకు ప్రాధాన్యం ఇచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కరీం నగర్ జిల్లా న్యాయమూర్తి ప్రీతి, ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు లు యాదగిరి శేఖర్ రావు, జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి చంద్రమోహన్ గౌడ్, మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, పట్టణాధ్యక్షుడు దుర్గా ప్రసాద్, నాయకులు పద్మచరణ్, బాలాజీ, విక్రమ్‌రావు, భాగ్యలక్ష్మీ, మధుసూదన్, లక్ష్మీనారా యణ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

కొలువుదీరిన గణనాథులు

● భక్తుల పూజలు ● ప్రత్యేక నైవేద్యాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 8: మంచిర్యాల జిల్లా కేంద్రంలో వినాయక చవితి పండగను ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండపాల్లో గణనాథులు కొలువుదీరాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో భజన కార్యక్రమాలు నిర్వహిం చారు. విశ్వనాథ ఆలయంలో గణనాథునికి తొలి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు విశ్వనాథ ఆలయంలో గణనాథున్ని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వాసవీ క్లబ్ సభ్యులు 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. దాత కొండ చంద్రశేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. విశ్వనాథ ఆలయం ప్రాంగణంలో హనుమాన్ దీక్షా సేవా పరిషత్ నాయకులు కార్తీక్, నితిన్‌లు మట్టి వినాయక విగ్రహాలను అందించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నాయకులు ఐబీ చౌరస్తాలో మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు అందజేశారు. నాయకులు రాజ్‌కిరణ్, సంతోష్, శ్రీనివాస్, సత్యం, రాజేష్,లింగన్న పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలో వినాయక చవితి పండగ సందర్భంగా మండపాల్లో గణనాథులు కొలువుదీరాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుని మండపాలను అం దంగా అలంకరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో ఎమ్మెల్యే వినోద్, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పలు వార్డుల్లోని వినాయక మండపాలను సందర్శించారు.

మందమర్రి టౌన్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో ఉన్న గణ నాథులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పాత బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 300 పైగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. రావికంటి వెంకటేశ్వర్లు హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు. చంద్రకాం త్, రాచర్ల రవి, గణేష్ పాల్గొన్నారు. ప్రజా సేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వ ర్యంలో విగ్రహాల పంపిణీకి ఎస్సై రాజశేఖర్ హాజరయ్యారు.

చెన్నూరు: వినాయక చవితి పండగ సందర్భంగా శనివారం చెన్నూరు పట్టణంలో, మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యా యి. వినాయక విగ్రహాలను మండపాల్లో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలతో నైవేద్యాలను సమర్పించారు. పట్టణంలోని ప్రతాపమారుతి ఆలయంలో ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. వేమనపల్లికి వెళ్తున్న ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

దండేపల్లి: మండల వ్యాప్తంగా గణనాథులు కొలువుదీరాయి. మండ పాలతోపాటు ఇండ్లలో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆదివారం మండపాల్లో భక్తులు కుటుంబ సమేతం గా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారు. దండేపల్లిలో సిద్ధి వినాయక భక్త మండలి వినాయక మం డపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభిం చారు. కన్నెపల్లి గ్రామంలో గణేష్ మండల నిర్వహణకు ఆదివారం అక్కల సుధాకర్ రూ.60వేలను విరాళంగా అందజేశారు. గ్రామంలో 6 మండపాల నిర్వహణకు ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున అందజేశారు.



క్యాంపు కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

భీమారం: మండల కేంద్రంలో వినాయక చవితి పండగ ఘనంగా జరిగింది. వినాయక మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. భక్తులు గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఇండ్లలో సైతం వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలో వినాయక చవితిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటిలో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆలయాల్లో, వాడవాడల గణపతి మండపాల వద్ద పూజలు, భజన కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాగా తహసీల్దార్ కార్యా లయం ఆవరణలో శనివారం పీస్ కమిటీ సమావేశం జరిగింది. వినా యక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ చిట్యాల సతీష్, శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, ఏఎస్ఐ ఇజాజ్ పాల్గొన్నారు.

జైపూర్: గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద గణనాధుని మండపాలను ఏర్పాటు చేసి భాజభజంత్రీలతో గణపతి విగ్రహాలను ప్రతిష్టించారు. ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు.

మందమర్రిరూరల్: వినాయక చవితి పండగను ఘనంగా జరుపుకు న్నారు. అందంగా అలంకరించిన మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు.

కాసిపేట: వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన మండపాల్లో గణనాధు లను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు.

జన్నారం: మండలంలో ప్రధాన కూడల్ల వద్ద ఏర్పాటు చేసిన వినా యక మండపాల్లో విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు.

హాజీపూర్: ప్రధాన కూడల్ల వద్ద వినాయక మండపాలను ఏర్పాటు చేసి గణనాధున్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. గుడిపేట 13వ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు దంపతులు, ఆర్ఐలు గోపి,శ్రీనివాస్,మారుతి, శ్రీనివాస్, సురేష్‌లు ప్రత్యేక పూజలు చేశారు.





పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, గుడిపేటలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు

కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తున్న ప్రధాని



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 8: ప్రధాని మోదీ కార్పొరేట్లకు ఊడి గం చేస్తున్నాడని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు పేర్కొ న్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా ప్రధాని మోదీ కార్పొరేట్‌లకు అనుకూలంగా పనిచేశాడని, కార్మికులను, ప్రజలను పట్టించుకోలేదన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. సింగరేణి కార్మికు లకు లాభాల వాటా 35 శాతం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని చెల్లించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంటు చేయాలని, అంత వరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాల న్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా కారన్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, పౌలు, కలీందర్‌ఆలీఖాన్, సరస్వతి, మల్లేష్‌వీరభద్రయ్య, సత్యనారాయణ, బాపు, రాజన్న, రాయమల్లు,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 8 : బీసీ కులాల ఐక్యవేదిక ప్రథమ వార్షికోత్సవ సభ కరపత్రాలను ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 12 హైద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో జరిగే సభకు బీసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు పడాల రామన్న, సూరన్న, మల్లేష్, సదానందం, కోటన్న, రాజేందర్, సంతోష్‌చారి, రవి, నర్సింహాచారి, రాజ్‌కుమార్, నరేందర్,అనిల్, సతీష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించేందుకు కృషి

-బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



సుంపుటంలో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వినోద్

వేమనపల్లి, సెప్టెంబరు 8: ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌తో మండలం లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ హామీ ఇచ్చారు. ఆదివారం సుంపుటం, వేమనపల్లి, ముల్కలపేట, రాచర్ల గ్రామాల్లో ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన పత్తి పంటలను పరిశీలిం చారు. రైతులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగడంతో నష్టపోయిన రైతులందరికి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. రైతులు ఈ విషయంలో అధైర్య పడవద్దని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిం చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నీల్వాయిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మండలంలోని 18 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను ఆర్డీవో హరికృష్ణతో కలిసి అందజేశారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు మామడకు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న తాత్కాలిక వం తెన కొట్టుకుపోవడంతో పరిశీలించారు. శాశ్వత వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కు మార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీ, నీల్వాయి మాజీ సర్పంచు గాలి మధు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థయిర్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, సెప్టెంబరు 8: కరాటేతో ఆత్మస్థయిర్యం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఆదివారం పద్మశాలి భవన్‌లో రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలకు అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి 600ల మందికి పైగా పాల్గొన్నట్లు టోర్నమెంట్ చీఫ్ కో ఆర్డినేటర్ నరేష్ తెలిపారు. నాయకులు బత్తుల సుదర్శన్, దాసరి శ్రీనివాస్, బడికెల రమేష్, సత్యనారాయణ, అరుణ్‌లు పాల్గొన్నారు.

నేడు మంచిర్యాలలో అప్రెంటిస్‌షిప్ మేళా

శ్రీరాంపూర్, సెప్టెంబరు 8: మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిం చనున్నట్లు ప్రిన్సిపాల్ వై. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. హైదరాబాద్‌లోని ప్రీమియర్ ఎనర్జీస్‌లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ ఒక్కో వంద చొప్పున, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, రెనె ఇంజిన్ వాల్వ్‌లో ఫిట్టర్ 30 మందికి అవకాశం ఉందన్నారు. అలాగే సెండ్లర్ ఎలక్ట్రిక్ ఇండియాలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 150 చొప్పున, శక్తి హార్మొనిస్, ఫీనెస్టా, ఎన్‌ఆర్‌బీ బేరింగ్స్‌లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్ డీజిల్ 130 ఉన్నాయన్నారు. అలాగే కరీం నగర్‌లోని ఆదర్శ ఆటోమొబైల్స్ మెకానిక్‌డీజిల్ (15), మెకానిక్ మోటార్ వెహికల్(10), ఎలక్ట్రీషియన్(5), ఇందారంలోని వీఈ వెహికల్స్(వోల్వో) మెకానిక్ డీజిల్(3), ఎలక్ట్రీషియన్(2) మొత్తం 675 ఖాళీలున్నాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటా, అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్ఎస్‌సీ, ఐటీఐ మెమో, ఎన్‌టీసీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా పుస్తకం, రెండు పాస్‌పోర్టు ఫొటోలు వెంట తీసుకురావాలని కోరారు.

శాంతి కోసమే సాహిత్యం

● 'పంపాతీరం' పుస్తక పరిచయ సభలో రచయిత్రి ఓల్గా

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: వివక్షలు, అణచివేతలు, హింసలేని శాంతియుత జీవితాలకోసమే సాహిత్యాన్ని సృజిస్తున్నానని రచయిత్రి ఓల్గా స్పష్టం చేశారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన పంపాతీరం పుస్తకపరిచయ సభలో ఆమెమాట్లాడారు. దేశంలో పెరుగుతున్న హింస, ఆదివాసీలు, దళితులపై జరుగుతున్న దాడులకు చలించి పంపాతీరం నవల రాశానని అన్నారు. కందుకూరి అంజయ్య, తోట నిర్మలారాణి పుస్తక పరిచయం చేయగా పుప్పాల శ్రీరాం ఓల్గా ఐదుదశాబ్దాల సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. పురాణేతిహాసాల పాత్రలను వర్తమానానికి అన్వయిస్తూ అద్భుత సాహిత్యాన్ని ఓల్గా సృష్టిస్తున్నారని కథా రచయిత డాక్టర్ బీవీఎన్ స్వామి అన్నారు. ఇటీవల మరణించిన సాహితీవేత్తలు డాక్టర్ కె ముత్యం, బండారు అంకయ్య, వడ్డేపల్లి కృష్ణలకు సంతాపం ప్రకటించారు. సాహితీవేత్తలు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఓల్గాను సన్మానించారు.

దొంగతనాలకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటాం



దొంగతనం వివరాలు తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి, సెప్టెంబరు 8: పట్టణంలో ఐదు దుకాణాల్లో దొంగతనానికి పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి దొంగతనం జరిగిన దుకాణ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులకు సంబంధించిన ఆధారాలను సేకరిం చామన్నారు. వ్యాపారస్తులు అందరు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ చేయవచ్చన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. ఏసీపీ రవికుమార్, సీఐలు దేవయ్య, అఫ్జలొద్దీన్, ఉన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

మంచిర్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమావేశమయ్యారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం హైద్రాబాద్‌లోని డిప్యూటీ సీఎం ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



పార్టీకి కార్యకర్తలే బలం : ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం సాయంత్రం కాసిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో పనిచేసే ప్రతీ కార్యకర్త పార్టీకి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు పనులు కొనసాగుతాయన్నారు. కార్యకర్తలు ఎవరు కూడా అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలందరు సమిష్టిగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా రత్నం ప్రదీప్ కొనసాగుతారని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అందరు సహకరించాలన్నారు. రత్నం ప్రదీప్, కారుకూరి రాంచందర్, రాజిరెడ్డి, ఘైదం రమేష్, గోలేటి స్వామి, రాజమౌళి, సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.



కాసిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

కాంగ్రెస్‌లో చేరికలు

బెల్లంపల్లి: తాండూర్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి వ్యతిరేకంగా ఎవరు ఏ పనిచేసినా క్రమ శిక్షణ చర్యలు ఉంటాయన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు ముందుకు వెళ్లాలని సూచించారు.

మండల కాంగ్రెస్ పార్టీలో విభేదాలు

కాసిపేట, సెప్టెంబరు 8: మండల కాంగ్రెస్ పార్టీలో విభేదాలు బయటపడ్డాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కొందరు బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఇంటి వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకోవద్దని వారం రోజుల క్రితం సోమగూడెం చౌరస్తా వద్ద బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులను హైద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 8 : తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌ను ఆదివారం బెల్లంపల్లి,మందమర్రి ముస్లీం జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఖాజీపేటలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనను కలిసి సన్మానించారు.మందమర్రిలో గ్రంథాయం సమస్యలను ఆయనకు విన్నవించారు. నాయకులు షరీఫ్, సలామొద్దీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో ఐదు దుకాణాల్లో చోరీ

బెల్లంపల్లి, సెప్టెంబరు 8: పట్టణంలోని బజార్‌ఏరియాలో ఉన్న ఐదు దుకాణాల్లో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పండిత్ మెడికల్, తిలక్ ఫోటో స్టూడియో, బాలాజీ ఎలక్ట్రికల్, మరో రెండు కిరాణ దుకాణాల తలుపులు పగులగొట్టి దొంగతనం చేశారు. బాధిత వ్యాపారులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి దుకాణాలు మూసివేసి వెళ్లామని, ఆదివారం ఉదయం దుకాణాల వద్దకు రాగా షెట్టర్ల తాళాలు, తలుపులు పగులగొట్టి ఉన్నాయన్నారు. దీంతో దుకాణాల లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరంగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించామన్నారు. తిలక్ ఫోటో స్టూడియోకు సంబంధించి నాలుగు కెమెరాలను ఎత్తుకెళ్లారని, వీటి విలువ రూ.85 వేలు ఉంటుందని, ఇతర దుకాణాల్లో రూ.6 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. సీఐ దేవయ్య క్లూస్ టీంలను రప్పించి వేలిముద్రలను సేకరించారు. దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తుల దృశ్యాలు సీసీ కెమెరాల్లో అగుపించాయని తెలిపారు. గాలింపు చేపడుతున్నామని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

జన్నారం, సెప్టెంబరు 8: మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన అజ్మీర రామ్‌సింగ్ (58) ప్రమాదవశాత్తు కడెం కెనాల్ కాలువలో పడి మృతి చెందాడు. ఈ నెల 6న రామ్‌సింగ్ పశువులను మేపడానికి వెళ్ళి కడెం కెనాల్ పడ్డాడు. అతడి మృతదేహం ఆదివారం కెనాల్ 15వ గేటు పిల్ల కాలువలో కనిపించింది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కొడుకు అజ్మీర దేవ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నస్పూర్, సెప్టెంబరు 8: మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం 40-45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం లభించింది. కుడి చేతిపై సంగీత, ఎడమ చేతిపై ఎస్‌వైఎస్ అని, ఎడవ వైపున ఛాతిపై పుట్టుమచ్చ ఉన్నదని రైల్వే ఇన్స్‌పెక్టర్ మహేందర్ తెలిపారు. బ్లూ పసుపు రంగు చెక్స్ ఫుల్ షర్ట్, బ్లూ రంగు జీన్స్ ధరించాడన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే 9701112343కి తెలియజేయాలన్నారు.

సంబరాలు


జన్నారంలో సంబరాలు చేసుకుంటున్న గౌడ సంఘం నాయకులు

జన్నారం, సెప్టెంబరు 8: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండల గౌడ సంఘం నాయకులు మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, నాయకులు పోచగౌడ్, తిరుపతిగౌడ్, శంకర్‌గౌడ్, పాపాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, ఎల్లాగౌడ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

జన్నారం, సెప్టెంబరు 8: కిష్టాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు నరహరి శర్మ 85 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడానికి ప్లేట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు స్టీల్ వాటర్ డ్రమ్‌ను బహుకరించారు. ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రివాల్వర్‌తో బెదిరించిన కేసులో ముగ్గురి అరెస్ట్

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్

నస్పూర్, సెప్టెంబరు 8: మంచిర్యాల జిల్లా కేంద్రంలో రివాల్వర్‌తో బెదిరించిన సంఘటన కలకలం రేపింది. శనివారం విలేకరుల సమావేశంలో డీసీపీ భాస్కర్ వివరాలను వెల్లడించారు. నెన్నెల మండలం ఆవడం గ్రామానికి చెందిన జితేందర్ స్వాతి దంపతుల మధ్య గొడవలతో మూడు నెలల నుంచి స్వాతి ఏసీసీలోని పుట్టింట్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 5న జితేందర్ అత్తగారింటికి రాగా అవడంకు చెందిన రాంటెంకి అన్వేష్ ఇంట్లో ఉండడంతో వారి మధ్య మాటామాటా పెరిగిందని తెలిపారు. అన్వేష్ జితేందర్‌పై దాడి చేయడంతోపాటు బయటకు తీసుకువచ్చి రివాల్వర్‌తో బెదిరించాడని, జితేందర్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో అన్వేష్ వెళ్ళిపోయాడని పేర్కొన్నారు. అనంతరం జితేందర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. విచారణ చేపట్టిన పోలీసులు రాంటెంకి అన్వేష్, దుర్గం భానుప్రసాద్ (ఆవడం), మంతెన అశోక్ (నస్పూర్)లను మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి రివాల్వర్, ఎయిర్ పిస్టల్, రెండు కత్తులు, మూడు బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.


సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తోకల తిరుపతి రోడ్డు ప్రమాదంలో ఎనిమిది నెలల క్రితం మృతి చెందగా అతనికి చెందిన రివాల్వర్‌గా డీసీపీ పేర్కొన్నారు. తిరుపతి బావమరిది అయిన మంతెన అశోక్ వద్ద రివాల్వర్ దాచిపెట్టాడు. అప్పుడప్పుడు తీసుకెళ్ళి మళ్ళీ అశోక్ ఇంట్లో దాచేవాడు. తిరుపతి చనిపోవడంతో రివాల్వర్ అశోక్ వద్ద ఉంది.

అన్వేష్, భానుప్రసాద్‌లు వరుసకు అన్నదమ్ములు కాగా వీరికి అశోక్ స్నేహితుడని తెలిపారు. నెన్నెల మండలానికి చెందిన కామెర మధు, దుగుట దిలీప్‌లతో కలిసి రాగి బిల్లలకు పూత పూసి బంగారు నాణేలుగా నమ్మించి విక్రయిస్తున్నారన్నారు. పలు సంఘటనల్లో ప్రజలను రివాల్వర్‌తో బెదిరించేవారని తెలిపారు. జితేందర్‌ను చంపేందుకు భానుప్రసాద్ ద్వారా అన్వేష్‌కు అశోక్ రివాల్వర్ అందజేశాడని తెలిపారు. రివాల్వర్‌తోపాటు నాందేడ్‌లో ఒక ఎయిర్ పిస్టల్, కత్తి కొనుగోలు చేశారని పేర్కొన్నారు. నిందితులు రాంటెంకి అన్వేష్, దుర్గం భాను ప్రసాద్, మంతెన అశోక్‌లను అరెస్టు చేశామని తెలిపారు. మంచి ర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మంచిర్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పేకాట ఆడుతున్న పలువురు వ్యక్తులను ఆదివారం రాత్రి రామగుండం కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ దాడిలో 10 మంది ప్రముఖ వ్యాపారులు పట్టుబడగా, రూ.52,320 నగదు, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో నల్మాసు జీవన్‌కుమార్, బుద్దార్థి శంకర్, పార్థ రాజేంద్ర ప్రసాద్, చందూరి సుధాకర్, గోపాల్ శర్మ, బోనగిరి యాదగిరి, సునీల్‌కుమార్ బల్వా, మిట్టపల్లి రామారావు, జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన దాసరి రవి, రామకృష్ణాపూర్ చెందిన పులి శ్రీనివాస్ ఉన్నారు.

మేకల దొంగల రిమాండ్

జైపూర్, సెప్టెంబరు 8 : మేకల దొంగలను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీధర్ ఆదివారం తెలిపారు. గంగిపెల్లి గ్రామ శివారులో తుర్క సత్యనారాయణరెడ్డికి చెందిన మేకల షెడ్డులో ఈ నెల 6న రాత్రి 8 మేకలను దొంగిలించారని సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారని తెలిపారు. దొంగల కోసం గాలించగా జిల్లాల శ్రీనివాస్‌గౌడ్, సుల్తాన్ సారయ్య, జె.మల్లేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. మేకలను దొంగలించడానికి ఉపయోగించిన కారు, బైక్‌ను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

హౌజింగ్ సొసైటీలో అక్రమాలు జరగలేదు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 8: హౌజింగ్ సొసైటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని హౌజిం గ్ సొసైటీ అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపా రు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఇటీవల పత్రికల్లో హౌజింగ్ సొసైటీలో అక్రమాలు జరిగాయని వచ్చిందని ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. ప్లాట్ నెంబరు 1 నుంచి 131 వరకు మొదటి దశలో కట్టారని తెలిపారు. ప్లాంటు నెంబరు 81, 92, 119, 121, 131 మొదటి దశకు సంబంధించినవి కాగా ఈ ఐదు ప్లాట్లు కలెక్టర్ కార్యాలయం కోసం తీసిన రోడ్డులో పోయాయని తెలిపారు. ప్లాట్లు పోయిన వారు సంప్రదిస్తే వారికి ప్రస్తుతం రెండో దశలో ప్లాటు కేటాయిస్తామని తెలిపారు. సొసైటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. సమావేశంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా

- స్థానికులు అడ్డుకోవడంతో ఆగిన నిర్మాణం


నిర్మాణ పనులకు వేసిన ముగ్గు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 8: పట్టణంలోని మార్కెట్ సెంటర్ ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల 4 గుంటల ప్రభుత్వ స్థలంలో ఓ వ్యాపారి కబ్జా చేసి నిర్మాణానికి పూనుకున్నాడు. చుట్టు పక్కల వారు అతనితో గొడవకు దిగారు. గతంలోనే ఆ వ్యాపారి స్థలాన్ని కబ్జా చేయడానికి నిర్మాణానికి యత్నించగా అప్పటి మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ అడ్డుకుని ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేశారు. మళ్లీ అదే వ్యాపారి బోర్డును తీసేసి నిర్మాణం చేయడానికి యత్నించాడు. విలువైన భూమిలో నిర్మాణం చేపడుతున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నెలల వ్యవధిలో మూడుసార్లు నిర్మాణం చేపట్టడానికి పూనుకున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

లైబ్రరీ నిర్మాణం చేపడతాం

పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల ప్రభుత్వ భూమిలో లైబ్రరీ ఏర్పాటు చేయిస్తామని కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్, మంద తిరుమల్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారి అక్రమ నిర్మాణం చేపట్టే విషయం తమ దృష్టికి తీసుకురావడంతో వెళ్లి పరిశీలించామని తెలిపారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో లైబ్రరీ నిర్మాణం చేపడతామని తెలిపారు. నాయకులు ఇసాక్, రాయబారపు కిరణ్, ఎర్ర రాజు, నర్సోజీ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం


బెల్టులను ప్రదానం చేస్తున్న ఎస్ఐ

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 8: కరాటే ఆత్మరక్షణకు ఆయుధమని, శారీరక ధృడత్వంతో పాటు మానసిక స్థిరత్వం పెంపొందుతుందని రెండో ఎస్ఐ రామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని గురునానక్ గార్డెన్స్‌లో డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆత్మరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. 50 మంది విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ అకాడమీ ఫౌండర్ రాజమల్లు, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, సీనియర్ మాస్టర్‌చంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి


చక్రపాణి (ఫైల్)

బెల్లంపల్లి, సెప్టెంబరు 8 : పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నల్ల చక్రపాణి (70) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ

బెల్లంపల్లి(తాండూర్), సెప్టెంబరు 8 : ఖమ్మంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రేపల్లెవాడలోని సెయింట్ థెరిస్సా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక సహాయం అందించినట్లు ప్రిన్సిపాల్ ఆంటోని తెలిపారు. విద్యార్థులు అందజేసిన డబ్బులతో ఖమ్మం వెళ్లి 50 కుటుంబాల వరద బాధితులకు సరుకులు అందజేశామన్నారు. వరద బాధితుల కోసం విద్యార్థులు అండగా నిలవడం గొప్ప విషయమన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి,సెప్టెంబరు 8: ద్వారక గ్రామానికి చెందిన మహ మ్మద్ చోటుమియా అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు ద్వారక మాజీ ఎంపీటీసీ ఇప్ప సురేందర్, జోగినపల్లి రమేష్, చెరుకు శ్రీనివాస్, సిద్ది ప్రతాప్, పడిగెల శంకర్‌రావు, జోగినపల్లి అశోక్, తోట శంకర్ రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు

హ్యాండ్‌బాల్ ఉమ్మడిజిల్లా సబ్‌జూనియర్ జట్ల ఎంపిక


ఎంపికైన బాలుర జట్టు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 8: జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఆదివారం ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తిరమేష్ ఆధ్వర్యంలో ఎంపికపోటీలుజరిగాయి. ఈఎంపిక పోటీల్లో ఉమ్మడిజిల్లానుంచి 150మందిబాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా హ్యాండ్‌బాల్‌కోచ్ అరవింద్, విశాల్, రమేష్, రాకేష్, సాయి వ్యవహరించారు. పీడీలు వివేక్, పీఈటీలు చిన్నక్క, పుట్‌బాల్‌కోచ్ రవి, కోకోకోచ్ తిరుమల్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14నుంచి 16వరకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

బాలికల జట్టు..: ఆసిఫాబాద్‌కు చెందిన ఎం కవిత, డి నందిని, పి అంజలి, ఎ ముతుబాయి, టి సత్యభామ, అనురాధ, బి వైశాలి, ఎ సుస్మిత, ఎం మధురాక్షి, స్మృతి, శిరీష, ఆదిలాబాద్‌కు చెందిన పి ప్రియ, ఆర్ వైష్ణవి, కె ప్రీతి, ఎస్ శ్వేత, మంచిర్యాలకు చెందిన హసీష, జె అక్షర, ఎం అక్షర, లక్ష్మీదుర్గ, దుర్గశ్రీ ఎంపికయ్యారు.

బాలురజట్టు..: ఆసిఫాబాద్‌కు చెందిన పి కార్తీక్, ఎన్‌మహేష్, ప్రణయ్, రాజేష్, ఆర్‌వేదింత్, ఎం.మహేష్, ఎ.శివరామకృష్ణ, ఆర్.అర్జున్, పి.సాయిచరణ్, మంచిర్యాలకు చెందిన రఘు, డి.విరోహిత్, లక్ష్మీకాంత్, కౌషిక్, సత్యవర్ధన్, ఆదిలాబాద్‌కు చెందిన డి.రవికుమార్, జి.రుద్ర,ఎ.కళ్యాణ్, జి.సాయికిరణ్ ఎంపియ్యారు.

రెబ్బెనలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం


పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

రెబ్బెన, సెప్టెంబరు 8: మండలకేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆశ్రమఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రూంటు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన సంచార గ్రంథాలయంద్వారా కథలపుస్తకాలు, పిల్లలచేత చదివించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు సత్యనారాయణ, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

దహెగాం, సెప్టెంబరు 8: మండలంలోని గిరివెల్లి గ్రామానికి చెందిన ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన పెంటక్క ఇంటి ముందు గొర్రెలకు ఇంజక్షన్లు వేసి డబ్బాలు, సూదులు పడవేశారు. ఎవరు పడవేశారో అంటుండగానే అదే గ్రామానికి చెందిన బాసవేని అంకుబాయి, ఆమెకూతురు మీనాక్షిదూషిస్తూ గొడవపడ్డారు. ఇదేక్రమంలో వీరిద్దరు కలిసి పెంట క్కను ఇనుపబొంగుతో ముక్కుపై కొట్టి గాయ పరిచారు. పెంటక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆకట్టుకుంటున్న విభిన్నరూపాల గణనాథులు


కాగజ్‌నగర్‌లో 20అడుగుల పొడవైన గణనాథుడు


కాగజ్‌నగర్‌లో పసుపుకొమ్ములతో గణనాథుడు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 8: పట్టణంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఆయామండపాల వారు విభిన్నరూపాల గణనాథులను ఏర్పాటు చేశారు. ఇందిరామార్కెట్‌లో 20అడుగుల పొడవైన గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యువజన గణేష్ ఆధ్వర్యంలో కొబ్బరాకులతో, శ్రీఆదిత్యా గణేష్ మండలి వారు చాక్లెట్‌లతో, శ్రీసాయి గణేష్ మండలి, భగత్‌సింగ్‌రోడ్డులోని శ్రీసాయిగణేష్ మండలివారు అయోధ్య రాముడి మాదిరిగా గణనాథులను ఏర్పాటు చేశారు. కాపువాడలోని శ్రీసాయిగణేష్ మండలి వారు పసుపు కొమ్ములతో గణనాథవిగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈవిగ్రహాలను చూసేందుకు పట్టణవాసులు ఆసక్తి కనబరుస్తున్నారు.


చాక్లెట్లతో ఏర్పాటు చేసిన గణనాథుడు


అయోధ్యరాముడి రూపంలో గణనాథుడు


పెంచికలపేటలో..


కాగజ్‌నగర్‌లో అయోధ్య రాముడితో గణపతి


కాగజ్‌నగర్‌లో మార్వాడి మందిర్‌లో..


ఆసిఫాబాద్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు


రెబ్బెనలో కొలువు తీరిన గణనాథుడు

మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాలి

- జనవిజ్ఞానవేదిక రాష్ట్రకార్యదర్శి నూతుల రవీందర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 8: దేశంలో మూఢనమ్మకాలతో కొంత మంది ప్రజలు బలవుతూనే ఉన్నారని దీనిని నివారించడానికి మూఢ నమ్మకాల నిరోధకచట్టం తేవాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులందరు మూఢనమ్మకాలను రూపుమాపేలాకృషి చేయాలన్నారు. అనంతరంజిల్లాకమిటీని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా మధుకర్,అధ్యక్షుడిగా రాజకమలాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధి కారిగా గంగారాం, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, లక్ష్మణ్, నారాయణ, వేణు,గోవిందరావు, కృష్ణప్రకాష్‌సఫల్, విద్యాకమిటీ కన్వీనర్‌గా తిరుపతయ్య, చెకుముకికన్వీనర్‌గా శ్యాంసుందర్, ప్రచార కన్వీనర్‌గా శంకర్, సాంస్కృతిక కన్వీనర్‌గా దామోదర్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా సాయికృష్ణ, పర్యావరణకన్వీనర్‌గాశ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం


కాగజ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 8: జిల్లాలో ఆదివారం ఓమోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు జిల్లాలోని ఆయా మండలాల్లో ఓమోస్తరు వర్షంకురిసింది. దహెగాంమండలంలో 36.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా సిర్పూర్(టి)లో 6.0మిల్లీమీటర్లు, సిర్పూర్(యూ)లో 4.0 మిల్లీమీటర్లు, జైనూరులో 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు వార్డుల అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ప్రమాదకరంగా కౌటాల రోడ్డు

- ఆదమరిచినా.. అదుపు తప్పినా అంతే..

సిర్పూర్(టి), సెప్టెంబరు 8: మండలకేంద్రం నుంచి కౌటాల, చింతలమానేపల్లి మండలాలకు వెళ్లే ప్రధానరోడ్డు మద్దెలవాగు సమీపంలో మూల మలుపు వద్ద రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈరోడ్డు గుండా 24 గంటల పాటు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డు కోతకు గురైనచోట అధికారులు కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కోతకుగురైన రోడ్డును బాగు చేయాలని అప్పటివరకు అక్కడ కనీసం ప్రమాద సూచికనైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


మద్దెలవాగు వద్ద కోతకు గురైన రోడ్డు

దొడ్డిగూడలో వైద్య శిబిరం

వాంకిడి, సెప్టెంబరు 8: మండలంలోని దొడ్డిగూడలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 58మందిని పరీక్షించి జ్వరాలతో బాధపడుతున్న 14 మంది రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీచేశారు. ఇంటింటికి వెళ్లి డ్రైడే గురించి అవగాహనకల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్,హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, గోదావరి, ఆశాకార్యకర్త గోదుబాయి పాల్గొన్నారు.




జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు

19 ఏళ్లుగా కొనసాగుతోంది

- నేటికీ పూర్తికాని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు
- పూర్తి కాని భూసేకరణ, కాల్వల నిర్మాణం
- వృథాగా పోతున్న వరదనీరు
- రూ.130కోట్ల నిధులు అవసరమవుతాయంటున్న అధికారులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 8: ఏదైనా ప్రాజెక్టు నిర్మిస్తే మహా అయితే ఐదేళ్లు.. పదేళ్లలో పూర్తి చేస్తారు. కానీ జిల్లాలోని కాగజ్‌నగర్ జగన్నాథ్‌పూర్ పెద్దవాగుపై నిర్మిస్తున్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు మాత్రం 19ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా ఇంత వరకు అతీగతీ లేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు 2005అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.125కోట్లతో 15వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే లక్ష్యంతో ప్రారంభించారు. ప్రభుత్వాలు మారటంతో ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించ లేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏమైనా అభివృద్ధి జరిగిందా అంటే అదీ లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మా రింది. ఈ ప్రాంత రైతులు ఈ ప్రాజెక్టుపై పెటు కున్న ఆశలు ఎండమావిగా మారుతున్నాయి. ఏటా వర్షాధార పంటలపైనే ఆధార పడాల్సి వస్తోంది. తొలుత ఈ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు టెండరు దక్కించుకున్న గ్యామన్ ఇండియా కంపెనీ నిధుల లేమి, బిల్లులు ఆలస్యం కావటంతో ఐదేళ్లలోనే చేతులెత్తేసింది. రాష్ట్రాలు విడిపోవటంతో ఈ ప్రాజెక్టు సమస్యను అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి ఎమ్మెల్యే కోనప్ప తీసుకెళ్లి నిధులు తెప్పించారు. ఈ నిధులతో కొంత పనులు చేశారు. అప్పటి నుంచి పిల్లర్ల స్థాయి వీడి గేట్లవరకు వచ్చింది. ప్రస్తుతం రూ.130కోట్ల నిధులు విడుదలు చేస్తే కాల్వలు నిర్మాణం, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి సరిపోతాయని అధికారులు పేరొకంటున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. అయితే ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. ఏటా విస్తారంగా కురుస్తున్న వర్షం నీరు వృథాగా పోతోంది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి అవుతాయని తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అనుకుంటున్న ప్రజలు ఆశలు ఎండమావిగానే మారుతున్నాయి.

● నిధుల కోసం ఎదురుచూపు..

ఈ ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న 53మంది రైతుల భూముల తాలుకూ అవార్డు చేశారు. ఇందుకు రూ.5కోట్ల నిధులు అత్యవసరమున్నట్లు ఇరిగేషన్ అధికారులు నివేదికలను సమర్పించారు. ఈ నిధులు విడుదల చేస్తే త్వరగా పనులు పూర్తిచేసే అవకాశం ఉందని, వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదికలను అందించారు. ఆ దిశగా నిధులు విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మరో నాలుగునెలల్లో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ ప్రాజెక్టుపై దృష్టిసారించి పెండింగ్ పనులు క్లియరెన్స్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగజ్‌నగర్, భీమిని మండలాలకు సంబంధించిన పలుగ్రామాల్లో ఈ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇందులో పరిహారం విషయంలో తలెత్తిన సమస్య ఇంతవరకు తీరటం లేదు. తమకు తక్కువ ధరతో నష్టపరిహారం కట్టిస్తున్నారని, మార్కెట్‌ధరతో కట్టివ్వాలని కొంతమంది రైతులు డిమాండు చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం..

-ప్రభాకర్, డీఈ, కాగజ్‌నగర్

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం. తదుపరి నిధుల కోసం వేచి చూస్తున్నాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. అలాగే 53మంది రైతుల అవార్డు నిధులు కూడా విడుదల చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు విడుదల కాగానే త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

కోలుకుంటున్న జైనూరు

- ఆంక్షల సడలింపు ● పోలీసుల కవాతు
- పరిస్థితులను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

జైనూరు/ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 8: విధ్వంసకాండ నుంచి జైనూరు ఇప్పుడిప్పుడే కొలుకుంటోంది. ప్రస్తుతం ఇక్కడప్రశాంత వాతావరణం నెలకొంది. ఎస్పీ డీవీశ్రీనివాస్‌రావు, డీఎస్పీ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ప్రజల సౌకర్యర్థం అధికారులు ఆంక్షలను సడలించారు. అధికారులు 144సెక్షన్‌ను సడలించారు. వినాయకచవితి, మిలాద్‌ఉన్‌నబీ పండుగల నేపథ్యంలో నిత్యావసర సరుకులకోసం ఉదయం 8నుంచి 11 గంటల వరకు తిరిగి సాయంత్రం 4నుంచి రాత్రి 7 గంటల వరకు సడలింపు ఇచ్చారు.

ఏజెన్సీ మండలాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత..

బుధవారం అర్ధరాత్రినుంచి జిల్లావ్యాప్తంగా ఇంటర్నెట్‌సేవలను నిలిపివేయగా తొమ్మిది మండలాలకు శనివారం సాయంత్రం ఇంటర్నెట్ సేవలను పునరుద్ధ రించారు. కానీఏజెన్సీ మండలాలైన జైనూరు, సిర్పూర్ (యు), లింగాపూర్, కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లో ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకురాలేదు.

ఆదిలాబాద్ రూట్‌లో నడవని బస్సులు..

144సెక్షన్ అమలులో ఉన్నందున ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ రూట్‌లో బస్సులు నడవడంలేదు. ఐదురోజులుగా ఆ రూట్‌లో బస్సులు వెళ్లకపోవడంతో ఆదిలాబాద్, ఉట్నూర్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువైపు వెళ్లాల్సిన ప్రయాణికులు వయా మంచిర్యాల మీదుగా లేదా మహారాష్ట్రలోని రాజూర, గడిచందూర్ మీదుగా వెళ్తున్నారు. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ రూట్‌లో ఐదు రోజులుగా బస్సులు నడవకపోవడంతో ఆర్టీసీకి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

నిత్యావసర సరుకుల కోసం ఇబ్బందులు..

జైనూరు ఘటన నేపథ్యంలో అక్కడి జనాలు నిత్యావసర సరుకులు సరిపడా దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం అధికారులు సడలింపులు ఇచ్చినప్పటికిని ఘర్షణలో పలు దుకాణాల్లో ఉన్న సామగ్రి అంతా కాలి బూడిదయింది. దీంతో మిగిలిఉన్న కొన్ని దుకాణాల్లో అందరికీ సరిపడా వస్తు సామగ్రి లేకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యా వసర సరుకుల కోసం సమీప గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పలువురిపై కేసు నమోదు?

జైనూరు అల్లర్ల నేపథ్యంలో ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన రోజు అల్లర్లలో పాల్గొన్న ఇరువర్గాలకు చెందిన వ్యక్తుల వివరాలను వీడియోల ద్వారా పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన సుమారు 70మందికిపైగా కేసులు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో కొంత మందిని శనివారం కరీంనగర్ జైలుకు రిమాండుకు తరలించినట్లు సమాచారం.

పండుగలను మత సామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలి: కలెక్టర్


ఆసిఫాబాద్ పెద్దవాగులో నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 8: ప్రజలుపండుగలను మతసామరస్యంతో ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలో గల గొడవెల్లివాగు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, విద్యుత్‌శాఖ ఏఈ సదాశివ్, ఎస్ఐ రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. వినాయక నవ రాత్రులు ముగిసినతరువాత నిమజ్జనం రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతానికి వచ్చేవాహనాలు సక్రమంగా వచ్చేందుకు చెట్లపొదలు తొలగించిరోడ్డుపై గుంతలకుమరమ్మతులు చేయాలని,ప్రొక్లెయినర్ అందుబాటులో ఉంచాలని, అవసరమైన మౌలికవసతులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని బజార్‌వాడీ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రసాద్, మోహన్, సాయి, బి సాయి, రాజు, రవి, నరేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం 144 సెక్షన్ సడలింపు..

జిల్లాలోని జైనూరు మండల కేంద్రంలో జరిగిన ఘటన నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకువిధించిన 144సెక్షన్‌ను ప్రజల సౌకర్యార్థం సడలించామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్‌ఉన్‌నబి పండుగల నేపథ్యంలో నిత్యా వసర సరుకుల కోసం ఉదయం 8నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4నుంచి 7గంటల వరకు సడలింపు ఇచ్చామని తెలిపారు. ఇంటర్నెట్‌సేవలను జైనూరు, కెరమెరి, సిర్పూర్(యు), లింగాపూర్, వాంకిడి,తిర్యాణి మండలాలు మినహా జిల్లాలో అందిస్తామన్నారు.

కాంగ్రెస్ గూటికి మున్సిపల్ మాజీచైర్మన్


సద్దాంహుస్సేన్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 8: తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ దండె విఠల్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మున్సిపల్ మాజీచైర్మన్ సద్దాంహుస్సేన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థులకు జ్వరాలు


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

సిర్పూర్(టి), సెప్టెంబరు 8: మండలకేంద్రంలోని ప్రభుత్వ గురుకుల బాలుర పాఠశాలలో 24మంది విద్యార్థులకు వైరల్‌జ్వరాలు సోకాయి. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా గురుకులపాఠశాలకు వచ్చి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితులపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను అడిగితెలుసుకు న్నారు. డీఎంహెచ్‌వో తుకారాంభట్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో వసతిగృహంలోనే చికిత్సలను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకుచికిత్సలు అందిస్తూనే మరికొంతమందిని మండలకేంద్రంలోని ప్రభుత్వ సామాజికఆసుపత్రికి తరలించారు. విద్యార్థులకు జ్వరాలు తగ్గేవరకు ఎవరినీ కూడా ఇళ్లకు పంపించవద్దని డీఎంహెచ్‌వో తెలిపారు. ప్రత్యేకంగా వైద్యటీంను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు వారికి సేవలు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఆర్ఐ మోహన్, ఈవో తిరుపతిని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆసుపత్రికివెళ్లి అక్కడ చికత్సపొందుతున్న విద్యార్థులతోపాటు రోగుల పరిస్థితి అడిగితెలుసుకున్నారు. అలాగే మందుల నిలువలు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు జ్వరాలతో బాధపడితే వెంటనే ఆసుపత్రికి తరలించాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఆమెవెంట వైద్యాధికారిణి కృష్ణవేణి, సిబ్బంది కిష్టయ్య తదితరులు ఉన్నారు.

పూజలందుకుంటున్న గణపయ్య


ఆసిఫాబాద్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆసిఫాబాద్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు


కౌటాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 8: వినాయక చవితిని పురస్కరించుకుని ఊరువాడ ప్రత్యేక మండపాలు ఏర్పాటుచేసి వినాయకులను ప్రతిష్ఠించారు. జిల్లాకేంద్రంలో 42వినాయకులు కొలువుదీరాయి. ప్రముఖులు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలో వివేకానందచౌక్ వద్ద పద్మశాలి సంఘంఆధ్వర్యంలో, మున్నూరుకాపుసంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌక్‌లో మట్టి వినాయకులను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్, లింగయ్య, సునీత, మంగ, వేణుగోపాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం వినాయకచవితి వేడుకలుఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలుకూడళ్లలో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారు. కొందరు ఇండ్లలో వినాయకుడిని ప్రతిష్ఠించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మండపాల్లో నెలకొల్పిన గణనాథులను దర్శించుకున్నారు. కాగజ్‌నగర్‌లోని పలుమండపాల్లో ఎమ్మెల్సీ దండేవిఠల్‌పూజలు నిర్వహించారు. అదే విధంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు సైతం పలు మండపాల్లో గణనాథులను పూజలు చేశారు. భగత్‌సింగ్ వార్డులోని ఓంసాయి గణేష్ మండపం వద్ద అన్నదానంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేందర్ పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమాల్లో బీజేపీరాష్ట్రకార్యవర్గసభ్యుడు కొంగసత్యనారాయణ, నాయకులు, కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలకేంద్రంతోపాటు గోలేటి, నంబాల, నార్లాపూర్, కిష్టాపూర్, గంగాపూర్, కొండపల్లి, నవేగాం, ఖైరిగాం, వంకులం గ్రామాల్లో శనివారం వినాయకచవితి సందర్భంగా ఆయాకూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పూజలను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సైచంద్రశేఖర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

బెజ్జూరు/చింతలమానేపల్లి/పెంచికలపేట/సిర్పూర్(టి)/వాంకిడి/కెరమెరి/కౌటాల/దహెగాం:మండలాల్లో వినాయక చవితివేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు గణనాథులకు ప్రత్యేకపూజలతోపాటు వివిధ రకాల నైవేద్యాలను సమర్పించనున్నారు. ఆయా గ్రామాల్లో వివిధఆకృతులతో మండపాలను అందంగా, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భాజాభజంత్రీలమధ్య గణనాథులను ప్రతిష్ఠించారు. బెజ్జూరు మండలకేంద్రంలో పద్మశాలిసేవాసంఘం ఆధ్వర్యంలో మట్టివిగ్రహాలను పంపిణీ చేశారు.పెంచికలపేట మండల కేంద్రానికి చెందిన లొంకరి శ్రీధర్ మట్టితో నాలుగు ఫీట్ల ఎత్తుగల విగ్రహాన్ని చేసి యువజన గణేష్ మండలికి అందజేశాడు.


కాగజ్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న మున్సిపల్‌కమిషనర్ అంజయ్య


కాగజ్‌నగర్: ఎమ్మెల్సీ దండే విఠల్‌ను సన్మానిస్తున్న సభ్యులు


కాగజ్‌నగర్: మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

నేడు సీఆర్టీలకు కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 8: గిరిజన సంక్షేమ ఆశ్రమ, ప్రాథమికపాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి తెలిపారు. తెలంగాణ గిరిజన క్రీడా పాఠశాలలో ఈనెల9,10తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 46 ఆశ్రమపాఠశాలలు, 320ప్రాథమికపాఠశాలలు ఉన్నాయని వీటిపరిధిలో 449 మంది సీఆర్టీలు పనిచేస్తున్నారన్నారు. వీరిలో 243మంది స్కూల్ అసిస్టెంట్లు, 206మంది ఎస్జీటీలు ఉన్నారన్నారు. 9వ తేదిన స్కూల్ అసిస్టెంట్లకు,10నఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తు న్నట్లు ఆమె తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 8: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగాభవన నిర్మాణాల అనుమతులకోసం టీజీబీపాస్‌లో దరఖాస్తుచేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ఒకప్రకటనలో తెలిపారు. మేజర్‌గ్రామపంచాయతీనుంచి మున్సిపాలిటీగా మారి ఆరునెలలతర్వాత నూతన నిర్మాణాలకుఅనుమతి రావడంతో ఇంతకాలం నెలకొన్న ఇబ్బందులు తొలగనున్నాయి.

జూనియర్ ఫారెస్టు అసోసియేషన్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 8: ఆసిఫాబాద్ డివిజన్ జూనియర్‌ఫారెస్టు కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డిప్యూటీరేంజ్ అధికారి యోగేష్, ఉపాధ్యక్షుడిగా అనీల్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా సాయిచరణ్, ఆర్గనైజింగ్‌కార్యదర్శిగా సద్దాంహుస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా జాయింట్ సెక్రెటరీ, ట్రెజరరీ పోస్టులకు ఇద్దరిచొప్పున పోటీపడగా జాయింట్ సెక్రెటరీగా స్వప్న,ట్రెజరరీగా రవి గెలుపొందారు. కార్యక్రమంలో మంచిర్యాలఅధ్యక్షుడు అజహర్, కాగజ్‌నగర్ అధ్యక్షుడు మునవీర్, డిప్యూటీరేంజ్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రజావాణి 11కి వాయిదా

ఆసిఫాబాద్, సెప్టెంబరు 8: రాష్ట్రస్థాయిలో మహాత్మజ్యోతిభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 10నుంచి 11వ తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒకప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించేందుకు ప్రతిమంగళ,శుక్రవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని ఈక్రమంలో 10వతేదీన ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘంతో ముఖ్య సమావేశం ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం 11వ తేదీకి వాయిదా వేశామని, జిల్లాప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



నేడు ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం అందజేయనున్న యాజమాన్యం

మందమర్రి టౌన్, సెప్టెంబరు 8: సింగరేణిలో గతసంవత్సరం కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా కార్మికులు తమ యూనియన్‌ను గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొద్ది నెలలుగా యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. ఈ నెల9న తమకు గుర్తింపు పత్రం రెండుసంవత్సరాల కాలపరిమితితో ఇస్తున్నారని, ఇది సరియైంది కాదని, న్యాయపోరాటం తప్పదన్నారు. ఏఐటీయూసీకి ఉన్న ఆదరణను తట్టుకోలేక ఇలాంటివి చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు తాము చేసే పోరాటాలకు కలిసి రావాలని పేర్కొన్నారు. గుర్తింపుపత్రం ఇచ్చిన వెంటనే కార్మికులసమస్యల కోసం పోరాడుతుందన్నారు. గత 20సంవత్సరాలుగా నాలుగు సంవత్సరాలు ఉండగా తమకు రెండు సంవత్సరాల పరిమితి పెట్టడం ఏమిటో అంతుచిక్కడం లేదన్నారు. ఏదిఏమైనా కార్మికులు తమ యూనియన్‌కు అండగా ఉన్నంతకాలం ఎవరూ ఏం చేయలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్బర్‌ఆలీ, దాగం మల్లేష్, కంది శ్రీనివాస్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాలవాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 8: సింగరేణి సంస్థగడిస్తున్నలాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటాఇవ్వాలని సింగరేణికాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం కోరారు. షిర్కే సెంటర్‌లో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైమాట్లాడారు. కాంట్రాక్టుకార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 7నుంచి 20వరకు అన్నివిభాగాల్లో సంతకాల సేకరణ చేపట్టామని, 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అన్ని ఏరియాల జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్మికులుహాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేందర్,తిరుపతి,రాజయ్య,శ్రీనివాస్,సంపత్,కొమురయ్య,నాగ రాజు,అనిల్,సత్యనారాయణ,మల్లారెడ్డి,వెంకటేష్,నర్సక్క,పుష్పలక్ష్మీ,తిరుమల పాల్గొన్నారు.

కోల్ ఇండియాలో సింగరేణి సత్తా చాటాలి: జీఎం


మాట్లాడుతున్న జీఎం

మందమర్రి టౌన్, సెప్టెంబర్ 8: కోల్ ఇండియాలో సింగరేణి క్రీడాకారులు తమ సత్తా చాటాలని, పథకాలు సాధించే క్రీడాకారులకు సింగరేణియాజమాన్యం ప్రోత్సాహకం అందిస్తుందని జీఎం దేవేందర్ తెలిపారు. ఆదివారం సీఆర్‌క్లబ్‌లో ఏరియా 60వ కార్మిక వార్షిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా హనుమాన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణిలో క్రీడాకారులకు కొదవ లేదని, యువకార్మికులు ఉన్నారని, వారు ఎంచుకున్న క్రీడలపై మరింత సాధనచేస్తే కోల్ ఇండియాలో పథకాలను సులువుగా సాధించవచ్చని తెలిపారు. సీఎండీ క్రీడలపై ప్రత్యేకదృష్టి పెట్టారని, క్రీడలకు సంబంధించి మైదానాలు, క్రీడా సామాగ్రి సకాలంలో ఇప్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, షటిల్ బ్యాట్మింటన్, టేబుల్ టెన్నిస్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, బ్రాంచిసెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, అధికారులసంఘం అధ్యక్షుడు రమేష్, క్రీడల గౌరవకార్యదర్శి ఎం కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి: - బెల్లంపల్లి జీఎం

రెబ్బెన: క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గోలేటి టౌన్‌షిప్‌లోని డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వార్షికక్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బెల్లంపల్లిఏరియాకు క్రీడారంగంలో మంచిపేరు ఉందన్నారు. కార్మికులు పోటీతత్వంతో క్రీడలో ఆడి రాణించాలన్నారు. ఈసందర్భంగా టేబుల్ టెన్నిస్ ఆడి, జిమ్‌చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పర్సనల్‌మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, మురిహరి రావు, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతాం'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 8: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 73రకాల కేడర్లలో 1.20 కోట్ల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి గతప్రభుత్వం వేతనజీవోలు విడుదల చేసి అమలుచేయలేదన్నారు. అలాగే సింగరేణిలో కాంట్రాక్టుకార్మికుల వేతనాలను పెంచేందుకు ఈనెల11న డైరెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. అక్టోబర్‌లో లాభాల వాటా ఇప్పిస్తామని తెలిపారు. మెడికల్, కేడర్ స్కీమ్,తదితర సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు.

పిట్ కార్యదర్శి కుటుంబానికి పరామర్శ

ఎస్ఆర్‌పీ3 పిట్‌కార్యదర్శి పెట్టం శ్రీనివాస్ కుమారుడు నివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారికుటుంబాన్ని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు, కేంద్ర నాయకులు గరిగె స్వామి, భీంరావు, నాయకులు రిక్కుల్ గోపాల్ రెడ్డి, సుధాకర్, రవీందర్, ఇండ్ల కిరణ్, కొట్టె సంతోష్, వనదీప్, తదితరులు పాల్గొన్నారు.